క్లుప్తంగా

కరపలో 72.54 శాతం పింఛన్ల పంపిణీ



గురజానాపల్లిలో తిరుమలశెట్టి సోమమ్మ నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో 11,692 మందికి వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా శుక్రవారం 8,481 మందికి (72.54 శాతం) పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. అన్నిరకాల పింఛన్ల సొమ్ము రూ.3,43,75,000 లబ్దిదారులకు ఇవ్వాల్సి ఉండగా రూ 2,49,53,500 ఇచ్చినట్టు తెలిపారు. శని, ఆదివారాల్లో నూరుశాతం పూర్తి చేయిస్తామని ఆయన చెప్పారు. వాకాడ సచివాలయంలో 81.76 శాతం, కరప-2 సచివాలయం 81.54 శాతం, గొర్రిపూడి-2 సచివాలయాలు 81.18 శాతంతో పింఛన్ల పంపిణీలో వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.


వైభవంగా ఆశ్లేషబలి పూజ



బృందావనంలో ఆశ్లేషబలి పూజ నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలో ఉన్న రాఘవేంద్రస్వామి బృందావనం ప్రతిష్ఠించి 46 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం రాఘవేంద్ర స్వామి బృందావనానికి ప్రధాన అర్చకులు రవీంద్ర భట్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నాగ దోష నివారణార్థం ఆశ్లేష బలి పూజ నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి బృందావన సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు వార్షికోత్సవాలు నిర్వహించేందుకు కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. కమిటీ అధ్యక్షుడు భగీరథ శర్మ, కార్యదర్శి వై రాఘవేంద్రరావు, కోశాధికారి వెంకటేష్, ఉపాధ్యక్షుడు ఎస్.అనంత రామారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ఆర్అండ్‌బీ ఎస్ఈ బదిలీ



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న ఆర్అండ్‌బీ ఉద్యోగులు

కాకినాడ సిటీ: జిల్లా రోడ్డు భవనాల శాఖ ఎస్ఈగా పని చేస్తూ బదిలీపై అనంతపురం జిల్లా జాతీయ రహదారుల పర్యవేక్షణ ఇంజినీర్‌గా వెళ్తున్న కె.హరిప్రసాద్‌కు ఆ శాఖ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం రాత్రి హరిప్రసాద్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఆ శాఖ ఈఈలు, డీఈలు, ఏఈలు, ఉద్యోగులు పాల్గొని వీడ్కోలు పలికారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన



సామర్లకోట రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీ గీత

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ వంగా గీత శుక్రవారం పరిశీలించారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో ఒకటో నెంబరు ప్లాటు ఫాంపై షెడ్లు, స్టేషన్ మేనేజరు, సిగ్నల్ వ్యవస్థ కార్యాలయానికి చెందిన భవన నిర్మాణం, ప్రయాణికులు వెయింటింగ్ హాల్ పనులను ఆమె పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రైల్వే స్టేషన్‌కు అమృతభారత్ పథకంలో మంజూరైన రెండో కాలిబాట వంతెన, ఎస్క్యులేటర్ పనులను వేగంగా ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవికాంత్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఏవీకె సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

తాళ్లరేవు: చెరువుగట్టు సెంటర్‌లో ఇటీవల అగ్ని ప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన మట్ట పర్తి తాతారావు కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ వంట సామగ్రి, ఇతర వస్తువులను అందజేసింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, రెడ్‌క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనల మేరకు సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి వీటిని అందించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు, నాయకులు రెడ్డి రెడ్డిబాబు, బొంతు వీరమోహన్, విత్తనాల రామకృష్ణ, ఎస్.ఈశ్వరరావు, ఎం.శ్రీను, కె.ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- జగనన్నతోనే సుపరిపాలన
- ఇళ్ల పట్టాల పంపిణీ సభలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- జగన్‌ను సీఎంను చేద్దామని పిలుపునిచ్చిన చలమలశెట్టి



ఎమ్మెల్యే కన్నబాబు, పార్లమెంటరీ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్‌ను సత్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి జరిగాయన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కన్నబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలం తూరంగి, కొవ్వూరు, ఇంద్రపాలెం గ్రామాలకు చెందిన 3187 మందికి ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. తూరంగిలో జరిగిన సభలో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. తూరంగిలో 2595 మందికి, కొవ్వూరులో 405 మందికి, ఇంద్రపాలెంలో 175 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ, గడపగడపకు కార్యక్రమాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించినట్టు తెలిపారు.

ప్రజలు తనకు ఇచ్చిన విజయానికి నిత్యం నియోజకవర్గ అభివృద్ధికి కష్టపడుతూ వారి రుణం తీర్చుకుంటున్నానన్నారు. రెండేళ్ల క్రితమే ప్రజలకు ఇళ్ల పట్టాలు అందించాల్సి ఉండగా టీడీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డు పడడంతో పట్టాల పంపిణీలో ఆలస్యం అయ్యిందన్నారు. సీఎం జగన్ ముందు చూపుతో తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పింఛన్‌తో పాటు వివిధ సంక్షేమ పథకాలు అందించారన్నారు. నియోజకవర్గంలో 32 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, రూరల్ మండలంలోనే 19 వేల పట్టాలు ఇచ్చి, లే అవుట్లలో మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన దమ్మున్న నాయకుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం



మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

విద్య, వైద్యానికి ఏ పాటి ప్రాధాన్యం ఇచ్చిందో ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. చిన్నపాటి సమస్యకు కాకినాడ జీజీహెచ్‌కో లేక పెద్ద పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులకో పరుగులు తీయాల్సి వచ్చేదని, నేడు ప్రతి ఇంటిని స్క్రీనింగ్ చేసి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి స్పెషలిస్టు, వైద్యాధికారులతో వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

రూ.25 లక్షల వరకూ కార్పొరేట్ వైద్యం

రూ.5 లక్షలున్న ఆరోగ్య శ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వీటితో పాటు విద్యకు సంబంధించి నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, 32 ప్రభుత్వ సంక్షేమ పథకాలను కేవలం మహిళల పేరుతోనే ఇచ్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేద్దామంటూ ఎమ్మెల్యే కన్నబాబు, సునీల్ పిలుపునిచ్చారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు పంపన రామకృష్ణ అధ్యక్షత వహించగా జెడ్పీటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ, మాజీ సర్పంచ్ సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు బలగం ప్రసన్నకుమార్, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గీసాల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డు సత్యనారాయణ, కురసాల సత్యనారాయణ, గొల్లపల్లి బాబులు, రొంగల వెంకటేశ్వరరావు, జగడం శ్రీహరి, గరికిన అప్పన్న, దుగ్గన దొరబాబు, కర్రి గంగాచలం, నేమాం, కొవ్వూరు సర్పంచులు, రామదేవు సూర్యప్రకాశరావు (చిన్న), పిల్లి చక్రధర్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మద్దతిచ్చారు.. థ్యాంక్స్



ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రానున్న ఎన్నికలో శెట్టిబలిజ సామాజిక వర్గం తరపున తనకు మద్దతు ప్రకటించడంపై ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కృతజ్ఞతలు తలిపారు. తనను కలిసి సంఘీభావం తెలియజేసిన ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణ, ఇతర నేతలకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. భవిష్యత్‌లో కూడా శెట్టిబలిజ సామాజికవర్గ అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడు అండగా ఉంటామని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు.

7న ఎంఆర్‌పీఎస్ఎస్ రాజకీయ చైతన్య సభ

కాకినాడ సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ ఈనెల 7వ తేదీన రావులపాలెంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మాదిగల రాజకీయ చైతన్య సభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జింగి సుధాకర్ పిలుపు నిచ్చారు. కాకినాడ శాంతిభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సభకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. సమితి నాయకులు పలివెల విజయ కుమార్, యార్లగడ్డ వరప్రసాద్, సవరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్, రంగరాయ అడ్మినిస్ట్రేటర్‌గా శ్రీధర్



బాధ్యతలు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్, రంగరాయ వైద్య కళాశాలల అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ నూకతోటి శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌కు ఆయన జాయినింగ్ రిపోర్టు సమర్పించారు. 2007లో డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన తాళ్లరేవు, అడ్డతీగలలో పనిచేశారు. 2009లో తహసీల్దార్‌గా పదోన్నతి పొంది అమలాపురం, రాజమహేంద్రవరం, రంపచోడవరం డివిజన్లలో విధులు నిర్వర్తించారు. చింతూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన కోవిడ్ వేళ కీలకంగా వ్యవహరించి కేసులను 220కి పరిమితం చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రభుత్వ ప్రయోజనాలను సకాలంలో ప్రజలకు అందించడమే కాకుండా, ఎన్జీవోలు చింతూరు పరిధిలో సేవలందించేందుకు వారిని ప్రోత్సహించడంలో ఆయన కృషి చేశారు. ఇటువంటి సేవలు అందించిన ఆయనకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి సుమారు మూడు జిల్లాల ప్రజలకు ప్రాణ ప్రదాయినిగా ఉన్న జీజీహెచ్‌కు, వైద్య విద్యలో అగ్రగామి రంగరాయ వైద్య కళాశాలకు సంయుక్త అడ్మినిస్ట్రేటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కాకినాడ జీజీహెచ్‌లో ఆయనకు ప్రత్యేక చాంబర్ ఏర్పాటైంది. జీజీహెచ్ వైద్యుల బృందంతో పాటు, మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో ఉద్యోగులు శ్రీధర్‌ను సాదరంగా ఆహ్వానించారు. తొలి రోజు ఆయన జీజీహెచ్, ఆర్ఎంసీలలో వివిధ విభాగాలను పరిశీలించారు.

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయమూర్తులు

కాకినాడ లీగల్: మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానందను కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవితో పాటు న్యాయమూర్తులు మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఆయన వ్యక్తిగత వ్యవహారాల కోసం కాకినాడ వచ్చి ఒక హోటల్‌లో ఉన్నారు. ఆయన గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్నారు.

పీహెచ్‌డీకి అవకాశం కల్పించాలి

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీలో ఆర్‌సెట్ అభ్యర్థులకు గ్రంథాలయ శాస్త్రంలో పీహెచ్‌డీ అవకాశం కల్పించాలని గోదావరి లైబ్రేరీ అసోసియేషన్ శుక్రవారం వీసీ ప్రసాదరాజుకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ప్రతి ఏడాది లైబ్రరీ సైన్స్ విభాగంలో రెండు పీహెచ్‌డీ సీట్లు కేటాయించే వారని, ఈ ఏడాది వెబ్‌సైట్‌లో అవకాశం లేనట్లుగా చూపిస్తున్న తరుణంలో దీనిపై పునరాలోచించాలని అసోషియేషన్ కార్యదర్శి కె.సాయిబాబు కోరారు. వర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల్లో ఎంతో మంది గ్రంథాలయశాస్త్రంలో పీహెచ్‌డీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు.

పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ

కమిషనర్ వెంకటరావు

కాకినాడ సిటీ: కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని భవనాలు, ఖాళీ స్థలాలపై పేరుకుపోయిన పన్ను బకాయిలపై ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పించిందని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటరావు శుక్రవారం సాయంత్రం తెలిపారు. పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి యజమానులు ఆస్తి పన్నులపై బకాయిలతో సహా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చి వరకు మొత్తం బకాయిలు ఈనెల 31వ తేదీ నాటికి చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దాత ఆశయాలకు అనుగుణంగా సేవలు



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. స్థానిక సినిమారోడ్డులోని మంత్రిప్రగడ వారి సత్రం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దాతలు సేవా కార్యక్రమాల కోసం వారి ఆస్తులు మొత్తం సత్రాలకు దానం చేశారని వారి ఆశయాలు కొనసాగించడం కమిటీ సభ్యుల బాధ్యత అన్నారు. సత్రం కార్యవర్గ సభ్యులుగా చిట్నీడి నారాయణమూర్తి, పోలిశెట్టి రాజశేఖర్, కొనాడి దుర్గాప్రసాద్, జీరి కరణాకర్‌రెడ్డి, సత్తి జయలక్ష్మి, అందవరపు వీరమణి, వాసిరెడ్డి వెంకటరామణకుమారి, మల్లువలస రాజేశ్వరి, గాబు అమ్మాజీతో దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సత్రం చైర్మన్‌గా చిట్నీడి నారాయణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్రం ఈఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కాకినాడ సిటీ: తమ డిమాండ్లు పరిష్కరించాలని పంచాయతీల అభివృద్ధికి నిధులు, అధికారాలు తక్షణమే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు వైవీబీ రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు కొనసాగించాలి

కాకినాడ సిటీ: భవన నిర్మాణ రంగంలో పని చేసే 53 రకాల వృత్తుల కార్మికులు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలంటూ భవన నిర్మాణ కార్మికులు, వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తూ ఇచ్చిన 1214 సర్కులర్ మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, గడిగట్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోండి

కాకినాడ సిటీ: ఓఎన్‌జీసీ పనుల వల్ల నష్టపోతున్న మత్స్యకారులను ఆదుకోవాలని కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ చైర్మన్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆందోళన చేయడం అభినందనీయమన్నారు. రాజకీయాలకు అతీతంగా కాకినాడ ప్రజలు ఉద్యమిస్తే గుజరాత్ తరహాలో ఇక్కడి ప్రజలకు తక్కువ ధరకే ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయవచ్చునని తెలిపారు. దీనిపై హైకోర్టులో పిల్ వేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సమస్యలపై 4వ తేదీ సోమవారం కలెక్టర్‌ను అఖిలపక్షం కలుస్తుందన్నారు. అలాగే ఈనెల రెండోవారంలో కాకినాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు మధు వివరించారు.

సమాజ సేవల్లో మహిళలు ముందంజ

బాలాజీచెరువు: సమాజ సేవలో మహిళలు ముందజలో ఉన్నారని అలయన్స్ సహ్రస క్లబ్ ప్రెసిడెంట్ ప్రసన్న లక్ష్మి పేర్కొన్నారు. అలయన్స్ క్లబ్ ఆఫ్ డిస్ట్రిక్ కన్వెన్షన్ అవార్డు ఫంక్షన్ శుక్రవారం నగరంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఉత్తమ క్లబ్‌తో పాటు ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డు సహస్ర క్లబ్‌కు రావడం సంతోషంగా ఉందని, ఏడాది పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పీఆర్‌ఓ మాటూరి శిరీష, చప్పిడి వేంకటేశ్వరరావు, దిలీప్‌కుమార్ సదనాని, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



వేళంగిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కరప: మండలం వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా మొదటిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలు జంబ్లింగ్ విధానంలో నిర్వహిస్తుండటంతో మండల పరిధిలో వేళంగిలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల్లో 563 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 26 మంది గైర్హాజరవ్వగా, 537 మంది పరీక్షలు రాశారు. పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసరావు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వి.బాలకృష్ణ ఇతర సిబ్బంది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్ఐ టి.రామకృష్ణ , ఏఎస్ఐ వి.సూరిబాబు సిబ్బందితో కల్సి బందోబస్తు నిర్వహించారు.

రేపు పోలియో చుక్కలు వేయించాలి

కరప: పోలియో రహిత సమాజం కోసం ఆదివారం ప్రభుత్వం తలపెట్టిన పోలియో చుక్కల పంపిణీని విజయవంతం నిర్వహించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ కోరారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పుడే పుట్టినబిడ్డ నుంచి అయిదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించేలా తల్లిదండ్రులను చైతన్యపరచాలన్నారు. 3వ తేదీన బూత్‌లలోను, 4, 5 తేదీలలో ఇంటింటి సర్వే చేసి, ఎవరినీ వదలకుండా పోలియోచుక్కలు వేయాలన్నారు. కరప పీహెచ్‌సీ పరిధిలో 9,959 ఇళ్లుండగా 3,992 మంది అయిదేళ్లలోపు చిన్నారులున్నట్టు గుర్తించామన్నారు. పోలియో చుక్కలు వేసేందుకు 28 బూత్‌లు, రెండు రూట్ టీమ్‌లు, ఒక మొబైలు టీమ్ ఏర్పాటు చేశామన్నారు. కొరిపల్లి, గొడ్డటిపాలెం ఇటుకల బట్టీల వద్ద, పెనుగుదురువంతెన వద్ద ఉండే వలసకూలీల కుటుంబాలలోని పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. వేళంగి పీహెచ్‌సీ పరిధిలో 7,843 గృహాల్లో 2,796 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని, వీరికి పోలియో చుక్కలు వేసేందుకు 20 బూత్‌లు, ఒక మొబైల్ బూత్, ఇద్దరు రూట్ సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసినట్టు డాక్టర్ ఎంకే సౌజన్య తెలిపారు.

ఆగడాలకు అడ్డుకట్ట

- ఏ కాలేజీ బయట చూసినా రోమియోలే
- ఒకరికొకరు తోడు లేనిదే తిరగలేకపోతున్న అమ్మాయిలు
- శ్రుతి మించుతున్న ఆకతాయిల అల్లరి
- నియంత్రించే చర్యల్లో పోలీసులు
- రెండు రోజుల్లో 20 మందికి కౌన్సెలింగ్

‘ఏ వయసు ముచ్చట్లు ఆ వయసులో ఉండాలంటారు. పిల్లలన్నాక అల్లరి చెయ్యాలి. అది అందరూ మెచ్చేలా ఉండాలి. అల్లరి చేసేవారు.. చేయబడే వారు దానిని ఆస్వాదించేలా ఉంటేనే ఆ అల్లరికి అందం. అది శ్రుతి మించితే.. వెగటుగా వేధింపుగా ఉంటేనే ఇబ్బంది. అటువంటి వారిని కచ్చితంగా అదుపుచేయాల్సిందే. చదువుకునే వయసులో విపరీత ధోరణులతో లక్ష్యాన్ని విడిచి ఫాల్స్ హీరోయిజాన్ని చూపాలని ప్రయత్నించే వారిని కచ్చితంగా నియంత్రించి వారిని సంస్కరించాల్సిందే. అదిగో ఆ పనే చేస్తున్నారు మన పోలీసువారు.’



యువకులను ప్రశ్నిస్తున్న మఫ్టీలో ఉన్న పోలీసులు

కాకినాడ క్రైం: చెదిరిన జుట్టు, చిరిగిన ప్యాంట్‌తో, పిచ్చి కూతలతో, బైక్ విన్యాసాలతో అమర ప్రేమికుల లెవెల్లో ఆడపిల్లల వెంట పడి వేధించే ఆకతాయిల ఆటకట్టిస్తున్నారు పోలీసులు. నగరంలో టూటౌన్ పరిధిలోని కళాశాలలు, పాఠశాలల వద్ద ప్రత్యేక బృందాలు రోడ్డు రోమియోలకు వాతలు పెడుతున్నారు. పట్టుబడటం ఆలస్యం అమాంతం వ్యాన్ ఎక్కించి స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో నగర డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలతో ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీ కారం చుట్టినట్లు సీఐ నాగేశ్వర్ నాయక్ తెలిపారు.

తరచు ఫిర్యాదులతో...

విద్యాలయాలు, కళాశాలల ఆవరణలో ఆకతాయిల ఆగడాలతో కొందరు విద్యార్థినులు, పలువురు తల్లిదండ్రుల వరుస ఫిర్యాదులతో ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు సీఐ నాయక్ తెలిపారు. టూ టౌన్ పరిధిలో సుమారు 12 ప్రధాన విద్యాలయాల ప్రాంతాలలో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం మఫ్టీలో ఆరు బృందాలను ఏర్పాటు చేశామని, వారితో పాటు యూనిఫాంలో మరో నాలుగు బృందాలు ఆకతాయిల వేటలో ఉన్నాయన్నారు.



ఆకతాయిల నుంచి బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఏం పని? ఎందుకొచ్చావ్?

కళాశాలలు వదిలే వేళల్లో ఆయా ఆవరణలకు వచ్చే ఆకతాయిల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఎవరైనా దొరకడం ఆలస్యం ఎందుకొచ్చావ్, ఎక్కడికెళ్తతాన్నావ్ వంటి ప్రశ్నలతో ఆరా తీసి తేడాగా అనిపిస్తే తాట తీస్తున్నారు. అక్కడితో సరిపెట్టక తల్లిదండ్రుల వివరాలు, వారి ఫోన్ నంబర్లు, చిరునామాలు సేకరించి నమోదు చేస్తున్నారు. రయ్‌మని దూసుకు వచ్చిన బైక్ నమోదు నుంచి లైసెన్సు ఉందా లేదా, మేజరా మైనరా అని ఆరా తీస్తున్నారు.

విద్యాలయాల్లో అవగాహన

విద్యార్థినులు, విద్యార్థులకు ఆయా కళాశాలల్లో తమకు ఎదరయ్యే సమస్యల పరిష్కారంలో తమ సేవలను వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

2 రోజుల్లో 20 మంది

రెండు రోజుల్లో 20 మంది రోమియోలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అకారణంగా ఆడపిల్లలు సంచరించే ప్రదేశాల్లో తిరగడం, వారి వెర్రిమొర్రి విన్యాసాలు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకు వారి తల్లిదండ్రులను పిలిచి హెచ్చరిస్తున్నారు. లైసెన్స్ లేకుండా పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని పోలీసులు సూచిస్తున్నారు. దొరికిన వారిలో ఎక్కువ మంది మైనర్లే ఉన్నారని, మొదటి తప్పిదంగా వదిలేస్తున్నామని మరోసారి దొరికితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

‘కేసులు బనాయిస్తే భవిష్యత్ పై ప్రభావం



అమ్మాయిల విషయంలో ఆకాయిలుగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. తొలి సారి పట్టుబడితే కౌన్సిలింగ్, మరో మారు పట్టుబడితే ఈవ్ టీజింగ్ సహా మహిళా వేధింపుల కేసులు పెడతాం. దీంతో విద్యార్థుల భవిత ప్రశ్నార్థకం అవుతుంది. ఇటువంటి సమస్యలు ఎదుర్కొనే యువతులు తమకు సమాచారం ఇవ్వాలి. ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం. విద్యాసంస్థల యాజమాన్యాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం బాధ్యతగా ఉండాలి.

– నాగేశ్వర్ నాయక్, సీఐ’

సకాలంలో గృహ నిర్మాణ సామగ్రి అందించాలి



గొడౌన్‌లో సరకును పరిశీలిస్తున్న పీడీ సత్యనారాయణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఆలస్యం లేకుండా గృహనిర్మాణ సామగ్రి అందించాలని జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక రమణ్యపేటలోని గృహ నిర్మాణశాఖకు సంబంధించిన స్టీల్, సిమెంట్ గొడౌన్‌ను ఆయన తనిఖీచేశారు. అక్కడ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. లబ్ధిదారుల అవసరం మేరకు మెటీరియల్ వారికి ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణ దశలను అనుసరించి వారికి మెటీరియల్ అందజేయాలన్నారు. గొడౌన్‌లో నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఈఈ వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మరిడమ్మకు పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేవారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.